క్లుప్తంగా

టీబీ ముక్త్ భారత్ ప్రారంభం



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాల, ఊత్కూరులో వెంకట్రావుపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సతీశ్‌కుమార్ మాట్లాడుతూ వారంరోజుల పాటు ప్రతీ గ్రామంలో వైద్యశిబిరం ఉంటుందని తెలిపారు. తెమడ వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందిస్తారని పేర్కొన్నారు. అనంతరం టీబీపై అవగాహన కల్పించారు. వైద్యులు సురేందర్, లక్ష్మణ్‌స్వామి, సిబ్బంది, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

తహసీల్దార్ మృతి బాధాకరం



నివాళులర్పిస్తున్న ఆర్డీవో శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారులు

మంచిర్యాలటౌన్: నెన్నెల తహసీల్దార్ జ్యోతి గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాసరావు అన్నారు. జిల్లాకేంద్రంలోని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) ఆధ్వర్యంలో శుక్రవారం ఆమె సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ట్రెసా జిల్లా అధ్యక్షుడు ఇత్యాల కిషన్, కార్యదర్శి ఎల్.కృష్ణ, ట్రెసా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.మధుసూదన్, రాష్ట్రకార్యదర్శి శ్రీనివాసరావు దేశ్‌పాండే, టీజీవో అధ్యక్షురాలు వనజారెడ్డి, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, పోచయ్య పాల్గొన్నారు.

ఘనంగా సాయన్న జయంతి

పాతమంచిర్యాల: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు పండగ సాయన్నముదిరాజ్ జయంతిని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు జిల్లా కేంద్రంలోని అమర వీరుల స్తూపం వద్ద ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, నాయకులు గజెల్లి వెంకటయ్య, తులా మధుసూదన్ రావు, భీంసేన్, భిక్షపతి, సతీష్, రాజేశం, వేముల అశోక్ పాల్గొన్నారు.

'బీసీ రిజర్వేషన్ల సాధనకు ఒత్తిడి పెంచాలి'

జన్నారం: రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన అన్ని పార్టీలపై ఒత్తిడి పెంచాలని బీసీ కులాల పోరాట సమితి ఉమ్మడి జిల్లా కన్వీనర్ కొడూరి చంద్రయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం జన్నారంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్‌పై అడపా దడపా చర్యలు తప్పా పూర్తి స్థాయిలో సాధించలేదని అన్నారు. కేంద్ర మంత్రులుగా బండి సంజయ్, కిషన్‌రెడ్డి రిజర్వేషన్ బిల్లు ఆమోదం విషయంలో ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా కో కన్వీనర్లు భాస్కర్‌గౌడ్, నరసయ్య, పొనకల్ పట్టణ మున్నూరు కాపు సంఘం కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు శ్రీరాముల సాంబయ్య, కనికి నరసయ్య, సీలోజు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ధర్నా

పాతమంచిర్యాల: బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఈనెల 10న జిల్లాకేంద్రంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఎం నాయకులు తెలిపారు. జిల్లాకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కేంద్రప్రభుత్వం బీసీ రిజర్వేషన్ బిల్లుకు మతం రంగు పూసి అడ్డుకుంటుందన్నారు. రవి, ప్రకాశ్, రంజిత్, ప్రేంకుమార్, బీసీ నాయకులు పాల్గొన్నారు.

భవనం సీజ్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని గ్రీన్‌సిటీలో అనుమతి లేకుండా నిర్మించిన భవనాన్ని టాస్క్‌ఫోర్స్ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. గ్రీన్‌సిటీలోని రాళ్లవాగు బ్రిడ్జికి సమీపంలో మంచిర్యాలకు చెందిన చంద్రమోహన్‌గౌడ్, కుమారస్వామిలు ఇంటిని నిర్మిస్తామని మున్సిపాలిటీ నుంచి అనుమతి తీసుకుని, దానిని ఫంక్షన్ హాల్‌గా నిర్మించడంతో ఆ భవనాన్ని సీజ్ చేసినట్లు టీపీఎస్ శ్యాంసుందర్ తెలిపారు.

పత్తి పంటల పరిశీలన

కాసిపేట: ముత్యంపల్లిలో పత్తి పంటలను ఏవో ప్రభాకర్ శుక్రవారం పరిశీలించారు. పత్తిలో రసం పీల్చే పురుగు ఎక్కువగా ఉందని దీని నివారణకు ఏసిఫేట్ 2 గ్రాముల లీటరు నీటిలో లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.4మిల్లీ లీటర్ల లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు.అనంతరం నానో యూరియా ప్రాముఖ్యత గురించి రైతులకు వివరించారు. ఏఈవో శ్రీధర్, రైతులు ఉన్నారు.

గ్రంథాలయంపై చిన్నచూపు

- భీమారం పంచాయతీ భవనంలో నిర్వహణ
- కూలిపోయాక.. దాత ఇచ్చిన భవనంలోకి
- పుస్తకాలు లేక నిరుద్యోగుల ఇబ్బంది



దినపత్రికలు చదువుతున్న యువకులు



భీమారంలోని గ్రంథాలయం

భీమారం: మండల కేంద్రంలోని 60 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన గ్రంథాలయంపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే పేరుగాంచిన భీమారంలో అప్పటి పెద్దల ప్రోద్బలంతో దీన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి పంచాయతీ భవనం కూలిపోయే వరకు అందులో కొనసాగింది. దాత చెర్కు సరోత్తంరెడ్డి సాయంతో ఆయన నిర్మించిన భవనంలోకి మార్చారు. అప్పట్లో చెన్నూర్, భీమారం గ్రామాల్లో గ్రంథాలయాలు ఉండేవి. నవలలు, కథలు, జనరల్ నాలెడ్జ్, ఇంగ్లిష్, తెలుగు దినపత్రికలతోపాటు విద్యార్థులకు అవసరమయ్యే పుస్తకాలను అందుబాటులో ఉంచేవారు. సాయంత్రం నాలుగైతే గ్రామస్తులు అక్కడికి పరుగులు తీసేవారు. కాని రానురాను అభివృద్ధి చెందాల్సిన గ్రంథాలయం వెలవెలబోతుంది. ప్రస్తుతం పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులు, అభ్యర్థులకు పుస్తకాలు లేక ఇబ్బంది పడుతున్నారు. కొందరు మాత్రం దినపత్రికలు, పాత పుస్తకాలను చదివేందుకు వస్తున్నారు.

11 పంచాయతీలకు ఒక్కటే..

మండలంలోని 11 గ్రామ పంచాయతీలకు కలిపి ప్రభుత్వపరంగా భీమారంలోని గ్రంథాలయం ఒక్కటే పెద్ద దిక్కుగా మారింది. సర్కారు ఉద్యోగ నోటిఫికేషన్ల ప్రకటించే నేపథ్యంలో గ్రామాల నిరుద్యోగులు పోటీపరీక్షలకు ప్రిపేరవుతున్నారు. వారికి అవసరమయ్యే మెటీరియల్ లేక ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందుతున్నారు. ఈ విషయంలో చర్యలు తీసుకుని పెద్దఎత్తున పుస్తకాలతో అందించాలని అధికారులను కోరినా నిధులు లేవని చేతులెత్తేశారు.

మెటీరియల్ అందించాలి



రాష్ట్ర ప్రభుత్వం లైబ్రరీలను అభివృద్ధి చేయాల్సి అవసరం ఉంది. భీమారం గ్రంథాలయానికి మంచి పేరుంది. దీన్ని కొనసాగించేందుకు అవసరమైన చర్యలు చేపట్టి మెటీరియల్ అందించాలి.

– తగరం శ్రీనివాస్, భీమారం

ముందస్తు రాఖీ వేడుకలు



తాండూర్: సీఐ, ఎస్సైలకు రాఖీ కడుతున్న ఎస్సై సౌజన్య



ఎస్సై స్వరూప్‌రాజ్‌కు రాఖీ కడుతున్న మహిళా కానిస్టేబుల్

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/చెన్నూర్/చెన్నూర్‌రూరల్/జైపూర్/తాండూర్: రాఖీ వేడుకలను శుక్రవారం ముందస్తు నిర్వహించారు. హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌లో మహిళా కానిస్టేబుళ్లు ప్రియాంక, అఫ్రీన్‌బేగం.. ఎస్సై స్వరూప్‌రాజ్, ఏఎస్సై చాంద్‌పాషా, హెడ్‌కానిస్టేబుల్ రవీందర్, కానిస్టేబుళ్లకు రాఖీ కట్టి మిఠాయిలు తినిపించుకున్నారు. కర్ణమామిడిలోని కేజీబీవీ విద్యార్థినులు ఎస్సై స్వరూప్‌రాజ్, ఏఎస్సై చాంద్‌పాషాలకు రాఖీ కట్టారు. తాండూర్, మాదారం మహిళా కానిస్టేబుళ్లు, సిబ్బంది సహచర కానిస్టేబుళ్లకు రాఖీ కట్టారు. సీఐ దేవయ్య, ఎస్సై కిరణ్ కుమార్‌లకు మాదారం ఎస్సై సౌజన్య రాఖీ కట్టారు. చెన్నూర్ ఈజీఎస్ కార్యాలయంలో ఏపీవో గంగాభవాని సిబ్బందికి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. చెన్నూర్ కస్తూర్బా కళాశాలలో విద్యార్థులు రాఖీలు కట్టుకున్నారు. జైపూర్‌లో కొనసాగుతున్న కోటపల్లి గురుకులంలో రాజేశ్ పదో తరగతి చదువుతుండగా సోదరిమణులు జన్నారం, దండేపల్లి మండలాల నుంచి వచ్చి స్థానిక హోటల్‌లో రాఖీ కట్టారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

జైపూర్: రామకృష్ణాపూర్ ఠాగూర్ స్టేడియంలో ఇటీవల ఆత్య–పాత్య అసోసియేషన్ ఆధ్వర్యాన అండర్–14 సబ్ జూనియర్ పోటీల్లో మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన బి.సాయి సహాజ్, ఆర్.విహాన్‌రిధీస్, ఎస్.అంజిత్ ఎంపికయ్యారు. పాఠశాల ప్రిన్సిపాల్ కోలా నాగేశ్వర్‌రావు, వ్యాయామ ఉపాధ్యాయులు సంతోశ్, పీడీ రత్నం శ్రీనివాస్ ఈ సందర్భంగా శుక్రవారం వారిని అభినందించారు. హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో ఈనెల 10న జరిగే రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు

- డీఏవో చత్రునాయక్



మాట్లాడుతున్న డీఏవో చత్రునాయక్

చెన్నూర్‌రూరల్: రైతులకు అధిక ధరలకు ఎరువులు అమ్మితే చర్యలు తీసుకుంటామని డీఏవో చత్రునాయక్ సూచించారు. మండలంలోని కిష్టంపేట రైతు వేదికలో చెన్నూర్ డివిజన్ పరిధిలోని ఎరువుల డీలర్లతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ ఎరువుల షాపులో స్టాక్ నిల్వలు, ధరల పట్టిక బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. వానాకాలం సీజన్‌లో కావల్సిన ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. వ్యవసాయ సాగుకు మాత్రమే యూరియా విక్రయించాలన్నారు. పారిశ్రామిక ప్రయోజనాలకు అమ్మవద్దని, యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రైతులకు నానో యూరియా, నానో డీఏపీ ప్రాముఖ్యతను తెలియజేయాలన్నారు. సమావేశంలో ఏడీఏ బానోతుప్రసాద్, ఏవోలు యామిని, మార్క్ గ్లాడ్‌స్టన్, సుధాకర్, కిరణ్మయి, సాయికృష్ణ, ఏఈవోలు పాల్గొన్నారు.



దండేపల్లిలో..



తాండూర్ మండలం బోయపల్లిలో..



టేకులపల్లి అభయాంజనేయస్వామి ఆలయంలో..

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

తాండూర్/మందమర్రిరూరల్/జన్నారం/భీమారం/లక్సెట్టిపేట/దండేపల్లి/భీమిని: శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, వ్రతాలు చేసి వరలక్ష్మి తల్లి.. రావమ్మా మహాలక్ష్మి అంటూ మహిళలు జిల్లాలోని వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇంట్లో లక్ష్మీదేవిని ప్రతిష్ఠించి పూజలు చేసి వ్రతాలు నోముకున్నారు. అనంతరం పసుపు, కుంకుమలను ముత్తైదువులకు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.



మందమర్రిరూరల్: మహంకాళి అమ్మవారి ఆలయంలో..

ఆర్టీసీ బస్సులు నడిపించాలి

మంచిర్యాలఅర్బన్: ఆర్టీసీ బస్సులను పాఠశాల సమయానికి అనుగుణంగా నడిపించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం మంచిర్యాల డిపో మేనేజర్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. మంచిర్యాల నుంచి మందమర్రి, ఆవడం మీదుగా భీమారం వెళ్లి మంచిర్యాలకు వచ్చే బస్సు భీమారంలో 8.30 గంటలకు ప్రారంభమై మందమర్రికి వచ్చేసరికి 10 గంటల సమయం పడుతుందని డిపో మేనేజర్ దృష్టికి తీసుకువచ్చారు. సమయం ఆలస్యం కావడంతో కళాశాల, ఐటీఐలకు వచ్చే విద్యార్థులు మొదటి క్లాస్‌లు మిస్ అవుతున్నారని పేర్కొన్నారు. మందమర్రి మోడల్ స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు బస్సు సమయానికి రానందున ప్రైవేట్ వాహనాల్లో రావాల్సి వస్తుందన్నారు. పాఠశాల, కళాశాల సమయాలకు బస్సులు నడపాలని, బస్‌పాసులు జారీ చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్, సహాయ కార్యదర్శులు నిఖిల్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలి



నిరసన ప్రదర్శన చేస్తున్న సీపీఎం నాయకులు

పాతమంచిర్యాల: బీహార్‌లో తొలగించిన ఓట్లను తిరిగి పునరుద్ధరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోమాస ప్రకాష్, జిల్లా కమిటీ సభ్యులు దుంపల రంజిత్, ప్రేంకుమార్, దాసరి రాజేశ్వరీ, ఐఆర్‌సీపీ నాయకులు జయరాజు తదితరులు పాల్గొన్నారు.

'అడ్డదారిలో గెలిచే యోచనలో బీజేపీ'

జన్నారం: బీహార్‌లో 60 లక్షల ఓట్లు తొలగించి బీజేపీ అడ్డదారిలో గెలవాలని చూస్తుందని సీపీఎం మండల కార్యదర్శి కనికరం అశోక్ ఆరోపించారు. మండల కేంద్రంలోని సుందరయ్యనగర్ కాలనీలో పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. బుచ్చయ్య, లక్ష్మణ్, రాజన్న, జయ పాల్గొన్నారు.

వలకు చిక్కిన భారీ చేపలు



మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధి గుడిపేట శివారులోని ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో ఓ మత్స్యకారుడు చేపల కోసం వేసిన వలకు శుక్రవారం రెండు భారీ చేపలు చిక్కాయి. ఈ బొచ్చ చేపల్లో ఒక్కో చేప 18 కిలోలకు పైగా ఉన్నాయి. కిలోకు రూ.200 చొప్పున మత్స్యప్రియులకు విక్రయించారు.

సంక్షిప్త వార్తలు

రోడ్డుభద్రత నియమాలు పాటించాలి

బెల్లంపల్లి: ఆటోడ్రైవర్లు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్ అన్నారు. పట్టణంలోని కాంటాచౌరస్తా వద్ద శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు వ్యక్తిగత భద్రతతోపాటు ప్రయాణికుల రక్షణపై శ్రద్ధ చూపాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దన్నారు. వాహన ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. ఎస్‌హెచ్ఓ శ్రీనివాసరావు ఉన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు

లక్సెట్టిపేట: డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ ప్రకాశ్ అన్నారు. మండలంలోని కేఎస్సార్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. పాఠశాలలు, టాటా ఏసీ వాహనాల డ్రైవర్లు వేగంగా వాహనాలు నడిపితే జరిమానా విధిస్తామన్నారు. తమవెంట వాహనపత్రాలు వెంట తెచ్చుకోవాలన్నారు. సీఐ రమణామూర్తి, ఎస్సై గోపతి సురేష్, రామయ్య, దండేపల్లి ఎస్సై తైసొద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ పనులు పునరుద్ధరణ

భీమిని: విద్యుత్ సమస్య లేకుండా చూస్తామని ఎస్ఈ ఉత్తమ్ కుమార్ అన్నారు. మండలంలోని చిన్నతిమ్మపూర్‌లో శుక్రవారం యుద్ధప్రతిపాదికన మరమ్మతు చేపట్టి విద్యుత్ సమస్య పరిష్కరించారు. గ్రామంలో గురువారం గాలివాన బీభత్సం సృష్టించడంతో ఇంటిపై రేకులు లేచిపోయాయి. ట్రాన్స్‌ఫార్మర్‌తోపాటు స్తంభాలు నేలకూలాయి. డీఈ రాజన్న, ఏఈ రాజనర్సులు సిబ్బందితో వెళ్లి స్తంభాలు సరి చేయించారు. కన్నెపల్లి మండలం జన్కాపూర్‌లో విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. లైన్‌మెన్ రమేశ్ ఉన్నారు.

సేఫ్టీ పరికరాలు అందజేత

చెన్నూర్‌రూరల్: ప్రమాద రహిత టీఎస్ఎన్‌పీడీసీఎల్ సంస్థగా ఉండాలని పిలుపునిస్తూ మండలంలోని ఎర్రగుంటపల్లి సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం లైన్‌మెన్లకు సేఫ్టీ పరికరాలు అందజేశారు. సేఫ్టీ హెల్మెట్, సేఫ్టీ బెల్ట్, గ్లౌజెస్, ఎర్త్ స్టిక్‌లను అందజేశారు. కొమ్మెర ఏఈ కేశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఖాళీబిందెలతో నిరసన

కాసిపేట: కోమటిచేను పంచాయతీ పరిధి సామగూడలో ఆరు నెలలుగా నీటి సమస్యను పరిష్కరించడం లేదని మహిళలు శుక్రవారం ట్యాంక్ వద్ద ఖాళీబిందెలతో నిరసన తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు.

ఆరుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు

చెన్నూర్: మున్సిపల్ కార్యాలయం ఎదుట పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపిన ఆరుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్యామ్‌పటేల్ తెలిపారు. సిబ్బంది పాల్గొన్నారు.

హాజీపూర్‌లో స్పీడ్‌గన్‌తో తనిఖీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ శివారులో మంచిర్యాల ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం స్పీడ్‌గన్‌తో విస్తృత తనిఖీ నిర్వహించారు. స్పీడ్‌గన్ చేత పట్టుకుని కార్ల వేగాన్ని చిత్రీకరిస్తూ 80 కి.మీ వేగ పరిమితికి మించి వాహనానికి స్పీడ్ గన్‌తో నేరుగా చలాన్లు వేస్తున్నారు.

ఓసీపీలో సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ గనిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు యాజమాన్యాన్ని కోరారు. యూనియన్ బ్రాంచి కార్యదర్శి షేక్ బాజీసైదా ఆధ్వర్యంలో నాయకులు ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి వెంకటేశ్వర్లును శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. యూనియన్ బ్రాంచి సంయుక్త కార్యదర్శి చంద్రమోహన్, జీఎం కమిటీ చర్చల ప్రతినిధి బుచ్చయ్య, క్లరికల్ కమిటీ ఇన్‌చార్జ్ రమేశ్, బానేశ్, సునీల్, శివకుమార్, జయబాబు, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారంపై హర్షం

తాండూర్: మాదారం టౌన్‌షిప్ సింగరేణి కార్మిక కాలనీలో నెలకొన్న నీటి సమస్య పరిష్కారం పట్ల ఏఐటీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి హర్షంవ్యక్తం చేశారు. మాదారంటౌన్ షిప్ ఏఐటీయూసీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. గత సంవత్సర కాలంగా ఉన్న నీటి సమస్య విషయమై ఏఐటీయూసీ నేతల విన్నపం మేరకు బెల్లంపల్లి ఏరియా జీఎం చొరవతో 75 హెచ్‌పీ మోటార్ కొత్తది కొనుగోలు చేసి కేటాయించారన్నారు. జీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో సత్యనారాయణ, రామచందర్ పాల్గొన్నారు.

మారు పేర్ల సమస్యపరిష్కరించాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో మారుపేర్ల సమస్య పరిష్కరించాలని బాధితులు డిమాండ్ చేశారు. నస్పూర్ కాలనీలోని శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో బాధితుల సంఘం ప్రతినిధులు దబ్బెట అంజయ్య, రాజయ్య, సంకీర్త్ మాట్లాడారు. సింగరేణిలో పనిచేసేటప్పుడు కొన్ని పొరపాట్ల వల్ల తాము సొంతపేర్లతో కాకుండా ఇతర పేర్లతో పని చేస్తున్నామన్నారు. కంపెనీ వ్యాప్తంగా వెయ్యి మంది కార్మికులు ఇలా ఉన్నారని తెలిపారు. తమ సమస్యలు పరిష్కరిస్తామని అప్పటి సీఎం కేసీఆర్ హామీ ఇచ్చినా నెరవేరలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం, గెలిచిన సంఘాలు తమ సమస్య పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు.

పోటీల పోస్టర్ ఆవిష్కరణ

మందమర్రిరూరల్: ఏరియాలోని సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో ఈనెల 31న రాష్ట్రస్థాయి ఓపెన్ టూ ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ కరాటే చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు మంచిర్యాల కుంగ్‌ఫూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరికృష్ణ తెలిపారు. శుక్రవారం ఏరియా జీఎం ఆఫీస్ ఆవరణలో జీఎం దేవేందర్, ఐఎన్టీయూసీ కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య తదితరులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. మిట్ట సూర్యనారాయణ, రామ్మోహన్, నాగలక్ష్మి ఉన్నారు.

35 శాతం లాభాల వాటా చెల్లించాలి

శ్రీరాంపూర్: కంపెనీ గత ఆర్థిక సంవత్సరం సాధించిన వార్షిక లాభాల నుంచి కార్మికులకు 35 శాతం వాటా చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో అన్ని గనులు, డిపార్టుమెంట్ల వద్ద శుక్రవారం నిరసనలు తెలిపి మేనేజర్లకు వినతిపత్రాలు అందజేశారు. ఆర్కే న్యూటెక్ గనిపై జరిగిన కార్యక్రమంలో యూనియన్ బ్రాంచి ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ కంపెనీ వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించి ఆందోళన నుంచి కార్మికులకు వాటాలు చెల్లించాలన్నారు. ప్రతీఏటా లాభాల వాటా చెల్లింపులో జాప్యం జరుగుతుందని తెలిపారు. నాయకులు వెంకటేశ్, సదానందం, రమేశ్, ప్రతాప్, పుల్లారావు, లింగమూర్తి పాల్గొన్నారు.

అత్యవసర వైద్యం అందించేందుకు సిద్ధం

మంచిర్యాలటౌన్: జిల్లాకు అత్యాధునిక 108 వాహనాలు అందించారని, బాధితులకు అత్యవసరంలోనూ వైద్యం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర 108 ప్రధాన కార్యాలయం ఉన్నతస్థాయి అధికారి డాక్టర్ భాగిష్ మిశ్రా అన్నారు. జిల్లా కేంద్రంలోని మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో వాహనాల పనితీరు, పరికరాలు పరిశీలించారు. అనంతరం మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల 108 సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 108 ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్, 108 వాహనాల కార్యనిర్వహణాధికారి బి.సంపత్, రాజశేఖర్, లింగాచారి, సతీశ్ పాల్గొన్నారు.

దాతకు సన్మానం

మంచిర్యాలరూరల్(హాజీపూర్):హాజీపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రానికి ఎండీ అక్బర్ రూ.1.30 లక్షల సొంత ఖర్చులతో ప్రహరీ నిర్మాణం చేయించాడు. కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్థానికులు శుక్రవారం దాత అక్బర్‌ను సన్మానించారు. మాజీ సర్పంచ్ శంకరయ్య, మాజీ వార్డుసభ్యుడు విషు పాల్గొన్నారు.

నాసిరకంగా ప్రహరీ పనులు

నెన్నెల: కొత్తూర్‌లో చేపడుతున్న ప్రభుత్వ పాఠశాల ప్రహరీ పనులు నాసిరకంగా చేపడుతున్నారని ఆ కాంగ్రెస్ నాయకుడి కాంట్రాక్ట్‌ను రద్దు చేయాలని బీజేపీ కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ డిమాండ్ చేశారు. శుక్రవారం పాఠశాల ప్రహరీ పనులను మండల అధ్యక్షుడు శేఖర్‌తో కలిసి పరిశీలించారు. నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డబ్బులివ్వడం లేదని చెత్త పోసిన కార్మికుడు



దుకాణం ముందు చెత్తను వేసేందుకు వెళ్తున్న కార్మికుడు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని కాలేజీరోడ్డులో ఓ ఎలక్ట్రిక్ షాపు ముందు ఉన్న చెత్తను రోజు తీసుకెళ్తున్నామని యజమానిని అడిగిన డబ్బులివ్వకపోవడంతో కార్మికులు శుక్రవారం రోడ్డుపై ఉన్న చెత్తను దుకాణం ఎదుట పోశారు. కార్మికుడు ఊడ్చిన చెత్తను తట్టలో వేసి, షాపు ముందు కుప్పగా పోసిన దృశ్యాలు, షాపు ముందు ఉన్న సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. ఈ విషయమై శానిటరీ ఇన్‌స్పెక్టర్ వైకుంఠం వివరణ కోరగా, సీసీ ఫుటేజీల్లో చూశామని, ఔట్‌సోర్సింగ్ కార్మికుడిపై విచారణ చేసి, చర్యలు తీసుకుంటామన్నారు. అప్పటివరకు పనిలోకి రాకుండా పక్కన పెట్టామన్నారు.

బైక్ చోరీ

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గద్దెరాగిడి బాలాజీ టౌన్ షిప్ కాలనీలో భూమయ్యకు చెందిన బైక్ చోరీకి గురైంది. బాధితుడు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. కాగా, సీసీ కెమెరాలో బైక్ చోరీ దృశ్యాలు రికార్డ్ అయినట్లు బాధితుడు తెలిపాడు.

'కమిషనర్‌ను విధుల నుంచి తొలగించాలి'

చెన్నూర్: మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ కమీషన్ల పేరుతో కాంట్రాక్టర్‌ను వేధింపులకు గురిచేయడంతో 4వ వార్డులో అభివృద్ధి పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయని మాజీ కౌన్సిలర్ రేవెల్లి మహేశ్ తెలిపారు. పట్టణంలోని బేతాళవాడ కాలనీవాసులతో శుక్రవారం సమావేశమై మాట్లాడారు. బేతాళవాడ నుంచి జాతీయ రహదారికి వెళ్లేదారిలో కల్వర్టు నిర్మాణ కోసం రోడ్డును తవ్వడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందన్నారు. కమీషన్లు డిమాండ్ చేసిన కమిషనర్‌ను విధుల నుంచి తొలగించి, కాంట్రాక్టర్ లైసెన్స్ రద్దుచేయాలన్నారు.